# పెద్దవారు

– భారతి భావరాజు

ఈమధ్య నాకొక ఆహ్వానం వచ్చింది, మాకోడలికి సీమంతం చేసున్నాం "మీరు పెద్దవారు, తప్పకవచ్చి మాకోడలిని ఆశీర్వదించి, అక్షింతలు వేసి వెళ్ళాలి" అని. ఇండియానుండి మా చెల్లెలుకూడా "అక్కయ్యా! నువ్వు పెద్దదానివి, దగ్గరగా వున్నావు, నేనా రాలేను అమెరికాకి ఇప్పుడు, తప్పకుండా అమ్మాయి లక్ష్మి సీమంతానికి వెళ్ళి దీవించి వస్తే నాకు చాలా తృప్తిగా వుంటుంది" అంది. చెల్లెలు లలిత మాట కాదనలేక లక్ష్మి సీమంతానికి వెళ్ళాను. అక్కడ వున్నంతసేపు, మాటి మాటికి, మీరు పెద్దవారు, హారతి ఇవ్వండి, అక్షింతలు వెయ్యండి, పెద్దవారు నిలబడే ఉన్నారు కూర్చోండి, పెద్దవారు భోజనానికి లేవండి, అమ్మాయ్, లక్ష్మీ! పెద్దవారు, మీ పెద్దమ్మకి ముందుగా తాంబూల ఇవ్వమ్మా... ఇవన్నీ విన్నాక, 'పెద్దవార'న్న పదవి, గౌరవం మాటటుంచి, నాకు దిగులు మొదలయింది. ఎందుకంటారా? నాఆలోచనలు కొన్ని దశాబ్దాలు వెనక్కి వెళ్ళి, నా 'చిన్నతనం'లో (నేనేమయినా అనచ్చు నా వయస్సుగురించి) పట్టుపరికిణీ, బంగారం నగలు, జడగంటలు, మల్లెపువ్వులు తో పేరంటానికి వెళ్ళినప్పుడు, మా అమ్మతో అందరూ, మీ 'పాప' ఎంత ముద్దుగావుందో అన్న మాటలు గుర్తుకొచ్చాయి. తరువాత కొన్ని సంవత్సరాలు నా పుట్టినరోజుకోసం ఎదురు చూసేదాన్ని. ఇరవయ్యి రాగానే పెళ్ళిఫొటోలకి అలంకరణతో, 'పాప' నుంచి 'అమ్మాయి' స్టేజికి మారాను. సరే, పెళ్ళి తరువాత అమెరికా రావడంతో "అమ్మలూ" అని పిలవడానికి అమ్మ, నాన్నగారు దగ్గరలేకపోవడం, వంట పని, ఇంటిపని, ఉద్యోగంతో పెద్దదాన్నవుతున్నానని నాకే బెంగ వచ్చేది రోజులలో. ఇంతలో పెద్ద షాక్, ఒకరోజు ఒక చిన్న పాప నా చీర గుంజుతూ, "ఆంటీ... ఆంటీ" అనడం విన్నాక, కాసేపు అటూ, ఇటూ చూసి, నన్నేసుమా ఈ పాప పిలుస్తోందని తెలుసుకున్నాక, ఇంక "పెద్దఅవుతున్నావు అని ఒప్పేసుకో" అని మనస్సు హెచ్చరిచినట్లనిపించింది. పైగా, చిన్నవయస్సులో పక్కింటి పిన్నిగారు, ఎదురింటి అత్తయ్యగారితో "నువ్వు" అని పిలిపించుకున్న నన్ను, అమెరికారాగానే వయస్సు పాతిక నిండకపోయినా 'నువ్వు' బదులు 'మీరు' అని స్నేహితులు పిలవడంతో ఏదో వెల్తిగానూ, ఫార్మల్ గానూ అనిపించేది. ఇరవయ్యవ పడి దాటుతూనే మరింక ఎవ్వరికీ నా వయ్యస్సు ఎంతో చెప్పాలనుండేది కాదు. పైగా ఎవరయినా నా వయస్సు తక్కువ చెప్పినప్పుడు, మనస్సులో సంతోషించి నిజం వయస్సు దాచేదాన్ని. కొన్నేళ్ళకి మా ఇద్దరు అమ్మాయిలు "అమ్మా! మమ్మీ!" పిలుపులతో నాహోదా మరింత పెరిగింది. అమ్మాయిలు పెద్దవాళ్ళయి, పెళ్ళిళ్ళు చేసుకునే సరికి, 'అత్తగారు'గా కొత్త బిరుదొచ్చింది నాకు. మరికొన్నేళ్ళకి నలుగురు మనుమలు "అమ్మమ్మా!" అని ఇంకొక హోదాని గుర్తుచేస్తున్నారు ప్రతీ పిలుపులోను. మరి కొన్ని దశాబ్దాలు చూసిన నాకు, నాలో ఎన్ని మార్పులొచ్చినా, మనస్సుమాత్రం "పెద్దవారనగానే" ఎందుకు అస్వస్థతగా అనుకుంటోందో అర్ధమవటంలేదు.

మావారికిమాత్రం చిన్నప్పటినుంచి, 'పెద్దన్నయ్య'గా పిలిపించుకోవడం, వాళ్ళ అమ్మకూడా "సరిగ్గా మాట వినకపోతే, పెద్దన్నయ్యకి చెప్తకతప్పదని" మిగత పిల్లలని బెదిరించడంతో, వాళ్ళ నాన్నగారికన్న ఎక్కువ భయం ఇంటిల్లిపాదికి తనంటే అనే ఒక ధీమా. పెద్దకొడుకుగా పుట్టడంతో వచ్చిన 'పెద్దరికం' ఒక హక్కని మురిసిపోతుంటారు ఇప్పటికీ! అసలు, వయస్సు ఎక్కువవుతూంటే సంతోషపడాలి గాని, విచారమెందుకు? అంటారు మావారు. ఇంకొక విశేషమేమంటే, మా వారికి నలభై నిండకముందే జుట్టు పల్చబడడం మెదలయింది. నాకు దిగులు మదలయింది అంతచిన్న వయస్సులోనే జుట్టు తెల్లబడింది, ఇంకెన్నాళ్ళో జుట్టు తలమీద నిలవదని, ముసలి రూపు వచ్చేస్తోందని.

మావారు మాత్రం దేశకాల పరిస్థితులూ, మిగత అవసరమైన విషయాలగురించి లోచించక నా జుట్టుగురించి నాకులేని బెంగనీకెందుకూ? అనేవారు. అలా వాదించుకుంటుండగానే, రెండు మూడేళ్ళకు జుట్టు చాలామటుకు రాలిపోయింది మావారికి. ఇంకపోతే, జుట్టున్నవారికి బాధలుకానీ, నాకుమాత్రం బాధలేంలేవని, నవ్వుకుంటూ చెప్పుతుంటారు ఇప్పటికీ. అదేకాక, 'పెద్దవార'న్నప్పుడల్లా మావారి మొహంలో కనిపించే ఉత్సాహానికీ, అదేమాటకి నా నిరుత్సాహానికీ ఎందుకంత తేడా అనిపించి, స్నేహితురాలు లతని అడిగాను. "ఇంతకీ వయస్సు గురించి కదూ నీ బాధ! ఎన్ని నిజాలు తెలుసుకున్నా, ఒప్పుకోవడం మాత్రం మనలోనే ఉందన్న మాటని నీకు మాత్రం తెలీదూ? వచ్చే వయస్సు రాక మానదు, అది లెఖ్ఖ పెట్టుకుంటూ విచారపడిపోయేకన్నా, పెద్దరికం హోదాని సంతోషించు మీవారిలాగ" అని సలహా ఇచ్చింది లత. మర్నాడు స్నేహితురాలన్నమాట గురించి ఆలోచిస్తుండగా, ఫోనులో లక్ష్మి అత్తగారు, మీరు పెద్దవారు, ఎలాగో వీలుచేసుకుని నిన్న మాఇంటికొచ్చి మా కోడలుని దీవించడం మాకు చాలా సంతోషంగా ఉందనేసరికి, నాకూ వాళ్ళ ఇంటికెళ్ళడం బాగానేవుందన్నానే కాని ఆవిడ అల్లా మళ్ళీ అనకపోతేనేం, అప్పటికే పదిసార్లు అన్నారుగా అనాలనిపించింది.

*****